ప్రొఫెసర్ ఆనందరావు నిద్రలేస్తూనే సిగరెట్ అంటించి మంచం మీదే ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

ఇవేళ ఆదివారం.... పట్టాభిని కలవాలి.... ఏమైనా కలవాలి.

తను విశాఖ వచ్చి రెణ్ణెల్లయింది అసలు తనిక్కడికి వస్తూనే పట్టాభిని కలవాలనుకున్నాడు. అలాంటిది, రెణ్ణెల్లయినా కలవలేక పోయాడు.

పట్టాభీ, తనూ కాలేజీలో చదువుకొనేటప్పుడు, ఒకే ఊళ్ళో ఉంటే, ఒకరినొకరు ఒక గంటన్నా విడిచి వుండేవారు కాదు.... ఇప్పుడు రెణ్ణెల్లు !

దూరాన్ని మైళ్ళతోనే కాదు కాలంతో కూడా కొలవచ్చన్న మాట !

నవ్వుకున్నాడు ఆనందరావు

లేచి పాత డైరీల కట్ట తిరగేసాడు . అయిదేళ్ళ క్రితం పట్టాభి బంధు వొకతను ఇచ్చిన ఎడ్రసు దొరికింది దానిని వేరే కాగితంమీద వ్రాసుకున్నాడు గబగబ స్నానం చేసి, బట్టలేసుకొని ఎవరో తరుముతున్నట్లు బైటపడ్డాడు.

'టిఫిన్ తయారయిపోయింది, తిని వెళ్ళండి' అంటున్న భార్య కేక వినిపించుకో లేదు ఆనందరావు.

పట్టాభిని చూడబోతున్నాడు తను ఆనందమో, బాధో తెలియని స్థితి ఆవహించిం దతన్ని

గతస్మృతులు నెమరువేస్తూ బస్ స్టేజి వైపు నడుస్తున్నాడు

పట్టాభి !. ఇరవై ఏళ్ళ క్రిందటి జ్ఞాపకాలను మోసుకొస్తుందా పేరు. ఆ జ్ఞాపకాలే చాలాకాలం వరకూ తనకు ఉత్తేజాన్నిచ్చేవి మైమరపించేవి. రాను రాను పాత సినిమాలా వెల వెల బోతున్నాయి ఎందుకనో జీవితంలో స్పందన లోపించింది అప్పట్లో ఏ చిన్న సంఘటనకైనా కదిలి పోయేది హృదయం. ఏ కొంచెం పరిచయ మైనా దానిచుట్టూ మమతల పందిళ్ళు అల్లేది.

ఉద్రేకమే ఊపిరిగా జీవించారు తనూ, పట్టాభీ తమిద్దరికీ సోషలిస్టు భావాలుండేవి. తమవద్ద నిషేధ సాహిత్యం కూడా ఉండేది తమకెంతో గర్వంగా ఉండేది పట్టాభి మాత్రం పూర్తిగా ఉద్యమాని కంకితమై పోయినట్లు ఉండేవాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, గంభీరంగా మౌనిలా ఉండే వాడు. చదువు పట్టించుకొనేవాడు కాదు. తనకు చదువుమీద, భవిష్యత్తుమీద ఆశ ఉండేది. అప్పుడప్పుడు పట్టాభి ఏమైపోతాడో అనుకొని ఆందోళన పడేవాడు తను

పట్టాభి డిగ్రీతో చదువు మానేసి వాళ్ల ఊరు వెళ్లిపోయాడు. తను యూనివర్సిటీకి అంకితమైపోయాడు. కొంతకాలం ఉత్తరాలు రాసుకున్నారు. క్రమక్రమంగా అవీ తగ్గిపోయాయి.

తను భయపడినట్లు పట్టాభి భవిష్యత్తు తలక్రిందులవలేదు. కాంట్రాక్టులు చేస్తూ బాగానే డబ్బు సంపాదిస్తున్నట్లు విన్నాడు.

చదువుకొనే రోజుల్లో తమ అనుబంధం ఈ జన్మకే కాదు... జన్మ జన్మలకూ కొనసాగుతుందని ఓ పిచ్చి నమ్మకం ఉండేది. అలాంటిది ఎంత సులువుగా మాయమైపోయింది!

మనిషి 'జీవితం' అన్న అదృశ్య శక్తి చేతిలో కీలుబొమ్మ!

వేదాంతిలా నవ్వుకున్నాడు ఆనందరావు, సిగరెట్ అంటిస్తూ.

బస్ ఖాళీగానేవుంది. ఎక్కి కూర్చున్నాడు.

తర్వాతి స్టేజిలో జనం బిలబిల్లాడుతూ త్రోసుకుంటూ ఎక్కేసారు. చూస్తుండగానే బస్ నిండిపోయింది.

'ఒరే... ఆనందూ!' ఆ గావుకేకకు ఆనందరావే కాదు, బస్సులో జనం అంతా ఉలిక్కిపడ్డారు.

విజేతలా జనాన్ని రెండు చేతులతో తలో వైపు నెట్టివేస్తూ కంగారు కంగారుగా ఒక భారీ ఆకారం ఆనందరావుని సమీపిస్తోంది. 'అతను గోపాలుడు, హైస్కూలులో తన క్లాస్‌మేటు' అన్న సంగతి స్ఫురించే లోపునే ఆ ఆకారం దగ్గరకొచ్చేసి అమాంతం చెయ్యి పట్టుకొని ఊపేస్తూ...

'ఏరా... గుర్తొచ్చానా?...గుర్తొచ్చానా?' అని గద్దించి అడుగుతూ, అతను సమాధానం చెప్పే లోపునే ప్రక్కకి త్రోసేసి చోటు చేసుకుంటూ... 'ఎందుకు గుర్తుంటాంలేరా? ఎందుకు గుర్తుంటాం?' అంటూ భయంకరంగా నవ్వేసింది.

ఆనందరావు తెప్పరిల్లి చిరునవ్వుతో, 'నువ్వు... గోపాలుడివి కదూ!...' అన్నాడు.

'ఒరేయ్... ఒరేయ్...' భుజం మీద బలంగా చరిచాడతను. 'నువ్వు ప్రొఫెసరువైనా బుర్ర బాగానే పనిచేస్తోంది.' మళ్లీ నవ్వందుకున్నాడు.

'ఆఁ. సరే... పిల్లలెంత మందిరా? అన్నట్లు నా కయిదుగురు అమ్మాయిల్రోయ్. పెద్దదాని కీమధ్యే పెళ్లి చేసాను. పెళ్లంటే గుర్తొచ్చింది— బాబ్బాబు, నీ కబ్బాయి లెంత మందో చెప్పరా... ముందిది విను. అల్లుడు అంతగా చదువుకోకపోయినా అతని వాటాకి పదిహేనెకరాలుంది. ఏదో గడిచిపోతుందనుకో. రెండోది టెన్తు... మూడోది నైన్తు... మా నాలుగోదాన్ని మా ఊరి ప్రక్క వూళ్లో హైస్కూలులో చేర్చాను. మనూళ్లో యూపీ స్కూలు కొత్తగా వచ్చిందిలే. చదువు బాగుండి చావదని... అన్నట్లొరే, మన రామంలేడూ... తాటిచెట్టులా ఎస్సెల్సీలో కూడా నిక్కర్లేసేవాడూ... అదేరా నీ సైకిలు తెగ వాడుకొనేవాడూ... వాడు మా ఊరు ప్రక్క ఊళ్లో హైస్కూలులో తెలుగు పండిట్‌గా చేస్తున్నాడు... నే చూస్తుంటానులే, నీ కూతుర్నిక్కడ చేర్పవోయ్, అన్నాడు... అయిందా— ఇక అయిదోది.. '

'నువ్వేం చేస్తున్నావో చెబుదూ...'చికాకు ధ్వనిస్తూ నవ్వుతూ అడిగాడు ఆనందరావు.

'మరిచా చెప్పడం...నేను మూడు మేనేజి చేస్తున్నాను. హోమియో, కరిణీకం, వ్యవసాయం. ఏదో గడుస్తుందనుకో... ఇంకా నలుగురికి పెళ్లి చేయ్యాలా బాబూ...' బస్సులోంచి అవతలికి తొంగిచూసి 'అప్పుడే జగదంబా వచ్చేసిందే! తరువాతి స్టేజి నేను దిగాల్సింది. అన్నట్లు నేనిక్కడికి ఎందుకొచ్చానో తెలుసా? ఇక్కడ మా తోడల్లుడున్నాడు. అతనికి ఏక్సిడెంటయితే హాస్పటల్లో చేర్చారు. చూడ్డానికొచ్చాను. ఫర్లేదులే ప్రాణభయం లేదు...' కాసేపు ఆగి, ఏదో గుర్తొచ్చినట్లు... 'ఇంత సేపూ నేనే వాగేసాను. ఒరే ఆనందూ... నీ గురించి చెప్పరా...' బతిమాలుతున్నట్లు అన్నాడు.

'ఏముంది చెప్పడానికి?' నవ్వుతూనే తేల్చేసాడు ఆనందరావు.

'అవున్లేరా... నా కెందుకు చెబుతావు? పెద్ద ప్రొఫెసర్వి. అదిగో నే దిగాల్సిన స్టేజి... మరచిపోకే... వస్తానే...' మరోసారి చేతులు పట్టుకొని కుదిపేస్తూ, పరుగెత్తుతున్నట్లు నడిచి దిగి పోయాడు గోపాలం.

ఆనందరావు నవ్వుకుంటూ సిగరెట్ అంటించాడు.

తను దిగవలసిన స్టేజి రాగానే బస్సు దిగి ఒకసారి చుట్టూ పరికించి చూశాడు ఆనందరావు. ఈ మధ్యనే డెవలెప్ అయిన కాలనీ కావడంతో రోడ్లు విశాలంగా, అందంగా ఉన్నాయి. మామూలు ఇల్లు మచ్చుకైనా కనబడ్డంలేదు. అన్నీ ఖరీదైన మేడలే.

పట్టాభి అంతస్థుని మనసులోనే ఊహించుకుంటూ ఎడ్రసు కాగితం ఓసారి చూచుకొని ముందుకి నడిచాడు.

నడుస్తున్నవాడు ఒకచోట ఆగిపోయాడు 'అవును... అదే నెంబరు...' ప్రక్కనే పి. పట్టాభిరామారావు అన్న నేమ్ బోర్డు తళతళ మెరుస్తోంది.

ఆనందరావుకి ఉన్నట్లుండి గుండె వేగంగా కొట్టుకోసాగింది. పట్టాభి జ్ఞాపకాలు హఠాత్తుగా మేలుకొని రణగొణ ధ్వనిలాంటి సంగీతాన్ని ఆలపించాయి మనస్సులో.

అది ఒక రెండంతస్థుల మేడ. చాలా ఆధునిక పద్ధతిలో కట్టబడింది. ఎదురుగా పెద్ద పూలతోట ఉంది. ఆ చుట్టుప్రక్కల మేడల్లో అదే ఆకర్షణీయంగా ఉంది.

'ఇంత అందమైన మేడకు పట్టాభి యజమాని!' అనుకున్నాడు. అది అభినందనో, గర్వమో, అసూయో అర్థం కాలేదు, తనకే.

నెమ్మదిగా గేటుతీసి లోపలికి నడిచాడు.

లోపల గవర్నమెంటు జీపు కనబడింది. ఆనందరావు కొంచెం సందేహిస్తూనే ముందుకు నడిచాడు. దగ్గరగా మాటలు వినబడుతున్నాయి. ధోరణిని బట్టి ఏదో చర్చించుకుంటున్నట్లు కనబడుతోంది. ఆనందరావు

మళ్లీ దీపావళి

వచ్చింది దీపావళొచ్చింది మరల
తొలగించగా మదిని నెలవైన ఇరుల
తెచ్చింది వెలుతురే తోరణాలల్లి
తెచ్చింది నవకాంతి సిరులపై జల్లి
నవరాగ గీతాల గళము విరుపించ
సమభావ తేజాల జనము వినుతించ
చీకటింటికి ముందు చిరుదీపముంచి
చెలిమి వెలుగును కంటి విందుగా పంచి
ఎదఎదను మానవత ప్రమిదగా మలచి
మమతయే తొలి వెలుగు దీపమై నిలిచి
చిరువంత తొలగించి చిగురించ శాంతి
మనసులో మెదిలింది పాలపుంతల కాంతి
వచ్చింది దీపావళొచ్చింది మరల
తొలగించగా మదిని నెలవైన ఇరుల.

—"సౌందర్యశ్రీ"

వెనుదిరిగి వెళ్లిపోదామనుకొనేలోపునే అతను హాలు గుమ్మం దగ్గరకు చేరాడు.

ఎదురుగా రివ్వాల్వింగ్ ఛైర్‌లో గెడ్డం క్రింద చెయ్యి ఆన్చుకొని కూర్చున్న ఒక భారీ ఆకారం ఆనందరావుని గుచ్చి గుచ్చి చూసింది. దాంతో మిగిలిన వాళ్ళు కూడా అటు చూసారు. వాళ్ళ సంభాషణకు ఫుల్‌స్టాపు పడి హఠాత్తుగా నిశ్శబ్దత ఆవరించింది.

ఆనందరావు దోషిలా నిలబడిపోయాడు.

కాస్సేపటికి ఎదురుగా కూర్చున్న భారీ ఆకారం ప్రశ్నించింది.

'ఆనంద్... ఆనందరావు కదూ...'

ఆనందరావు కాస్త తేలికపడి అవునన్నట్లు నవ్వాడు.

మిగిలినవాళ్ళు మొహాలు మాడ్చుకొని కూర్చున్నారు.

'రావోయ్... అక్కడే నిలబడిపోయావేం?'

పట్టాభి తనను చూడగానే అమాంతం కౌగలించుకుంటాడనీ, ఆనందంలో ఉక్కిరిబిక్కిరవుతాడనీ ఏవేవో ఊహించుకున్నాడు తను. కనీసం కుర్చీలోంచి లేవనుకూడా లేవలేదు.

ఆనందరావు మనసులోనే నవ్వుకుంటూ లోనికి నడిచాడు.

'ఇతను నా క్లాస్‌మేటు ఆనందరావు... డాక్టరేట్ సంపాదించి రీడర్‌గా పని చేస్తున్నాడు. ఇప్పుడు...' ప్రశ్నార్థకంగా ఆనందరావు వైపు చూసాడు.

దూరం

'ఇక్కడే...' కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ అన్నాడు ఆనందరావు.

'ఐ. సీ. వెరీ గ్లాడ్. వీరు చీఫ్ ఇంజనీర్. వీళ్ళు జూనియర్ ఇంజనీర్స్...' అంటూ గబగబ పరిచయం చేసేసి తన పని అయిపోయినట్లు సిగరెట్ అంటించి ప్యాకెట్ ఆనందరావు వైపు త్రోసాడు.

'పట్టాభి చాలా మారిపోయాడు. మనిషి బాగా లావయ్యాడు. కుర్చీకి నిండుగా సరిపోయాడు. ఠీవిగా ఉన్నాడు' అనుకుంటూ ఆనందరావు సిగరెట్ అంటించాడు.

అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆ నిశ్శబ్దానికి కారణం తనేనన్న సంగతి హఠాత్తుగా గుర్తొచ్చింది ఆనందరావుకి. ఒక్క క్షణం అక్కడ కూర్చోలేకపోయాడు.

'పట్టాభీ... వస్తాను.' నవ్వుతూ అందరి వద్ద సెలవు తీసుకొన్నాడు.

అందుకోసమే ఎదురుచూస్తున్న పట్టాభి.. అంతలో ముఖం విచారంగా పెట్టి 'సారీ ఆనంద్... వచ్చే ఆదివారం రాకూడదూ... లీజర్లీగా మాట్లాడుకోవచ్చు.'

ఆనందరావు తలూపి ఇవతలికి వచ్చి రోడ్డెక్కాడు.

అతని చెవుల్లో పట్టాభి అన్న చివరి మాటలే గింగురుమంటున్నాయి. తననే ఎందుకు రమ్మన్నాడు? 'నీ ఎడ్రసు ఇయ్యి. నేనే వచ్చి కలుస్తాను' అని ఎందు కనలేకపోయాడు పట్టాభి.

నవ్వుకున్నాడు ఆనందరావు.

ఈ పట్టాభి ఏమైపోతాడో అనుకొని జాలి పడేవాడు తను. ఇప్పుడు ఎవరిని చూసి ఎవరు జాలి పడాలి! తను డిగ్రీలు సాధించాడు. పట్టాభి అంతస్థు సాధించాడు. తనకో చిన్నపాటి స్వంత ఇల్లయినా లేదు. అతను రెండంతస్థుల భవనానికి యజమాని!...ఎంత ఆశ్చర్యం?

ఎవరో సిగరెట్ పొగ ముఖం మీదికి వదులుతూ అతనిని రాసుకుంటూ వెళ్లిపోయారు. మరో ప్రక్క నుంచి దుమ్ము రేపుతూ కారు దూసుకుపోయింది.

ఆనందరావు ఎండలో బస్‌స్టేజి వైపు నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

దూరాన్ని మైళ్లతోను, కాలంతోనే కాదు డబ్బుతో కూడా కొలవచ్చును.

అంతలో గోపాలం గుర్తొచ్చాడు. 'నాతో ఎందుకు చెబుతావులేరా? పెద్ద ప్రొఫెసర్‌వి' అని వాడన్నప్పుడు నవ్వుకున్నాడు తను. ఇప్పుడర్థమౌతోంది తనకు. గోపాలానికే భాషొచ్చుంటే 'దూరాన్ని చదువుతో కూడా కొలవచ్చు' అనుకొనే వాడేమో!

రోడ్డుమీద... భర్త మీసం మెలేస్తూ ఠీవిగా ముందు నడుస్తున్నాడు. పైటకొంగు భుజం చుట్టూ కప్పుకొని తలవంచుకొని అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోంది భార్య.